అప్పన్న చెంత.. ఉచిత వసతి చింత!

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం సింహాచలేశుడి సన్నిధిలో పేద, మధ్యతరగతి భక్తులు విశ్రాంతి భవనాల కోసం ఇక్కట్లు పడుతున్నారు. వీరి కోసం కేటాయించిన ఉచిత సత్రాల నిర్వహణను దేవస్థానం అధికారులు గాలికొదిలేశారు. దీంతో అరకొర సౌకర్యాల మధ్య భక్తులు సర్దుకుపోవాల్సి వస్తోంది. కటిక నేల మీద నిద్రిస్తూ, కాలకృత్యాలు తీర్చుకునేందుకు సరిపడా వసతుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత వసతి భవన నిర్మాణ ప్రతిపాదనలు అమల్లోకి రాక తాత్కాలిక భవనాల్లో నెట్టుకొస్తున్నారు.

- శ్రీదేవి కాంప్లెక్స్‌లో అరకొర సౌకర్యాలు
- లాకరు సదుపాయం లేకపోవడంతో భక్తుల ఇక్కట్లు
- బస్టాండ్ పక్కనే సత్రం.. సమాచారం పూజ్యం
- పక్కా భవనాలను గాలికొదిలేసిన వైనం


ప్రస్తుతం ఉచిత బస ఉన్న శ్రీదేవి కాంప్లెక్స్


కొండ దిగువ దేవస్థానం బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న ఉచిత విశ్రాంతి భవనం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే పేద, మధ్యతరగతి భక్తులు కొండ దిగువ ఉచిత బస కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. వీరికి కేటాయించిన శ్రీదేవి కాంప్లెక్స్ హాల్స్‌లో అరకొర సౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. పక్కా భవనాలను ఎలానూ నిర్మించలేదు.. ఉన్న తాత్కాలిక భవనాల్లో కూడా కనీస వసతులకు చొరవ చూపకపోవడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి లాకర్ సదుపాయం కూడా లేక.. వెంట తెచ్చుకున్న సామగ్రిని మోసుకుంటూ స్వామి దర్శనానికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

రాత్రి 9 దాటితే కొండ దిగువనే బస

సింహాచలేశుడిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల్లో అగ్రభాగం పేద, మధ్యతరగతి వారే. ఉత్తరాంధ్రులైతే.. తిరుపతి వెంకన్న దర్శనం చేసుకున్నాక.. సింహాచలం అప్పన్న దర్శనం తప్పనిసరి. దూరప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో వచ్చే వీరు.. రాత్రి 9 దాటిందంటే కొండ దిగువనే బస చేయాలి. భారీ మొత్తం చెల్లించి ప్రైవేట్ లాడ్జీల్లో బస చేయలేని వారి కోసం సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న శ్రీదేవి కాంప్లెక్స్ పైఅంతస్తులోని రెండు కల్యాణమండపాల(హాల్స్)ను ఏడాదిన్నర క్రితం కేటాయించారు. ఒక్కో హాల్‌కు నాలుగేసి చొప్పున మరుగుదొడ్లు, స్నానపు గదుల్ని మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కేటాయించారు. అవి సరిపోవట్లేదు. ప్రధానంగా వారాంతపు రోజులు, సెలవు దినాల్లో చాలా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం చాపలు కూడా ఇచ్చే దిక్కులేక, కటిక నేల పైనే నిద్రించాల్సిన పరిస్థితి.

కానరాని బోర్డులు

సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ పక్కనే శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఉచిత బస ఉన్నా చాలా మంది భక్తులకు తెలియదు. దీనికి కారణం ఉచిత బస ఉందన్న సమాచారాన్ని సూచిస్తూ ఎక్కడా దేవస్థానం బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆర్టీసీ బస్సులు దిగాక మార్కెట్‌లోకి వెళ్లి భక్తులు ఆరా తీయాల్సిన పరిస్థితి. బస్టాండ్ పక్కనే ఉందని స్థానికులు చెప్తే.. మళ్లీ కాళ్లీడ్చుకుంటూ వెనక్కి రావాల్సి వస్తోంది.

వంటశాలగా ఉచిత విశ్రాంతి మందిరం

కొండ దిగువ దేవస్థానం ట్రాన్స్‌పోర్టు బస్టాండ్‌లో ఉన్న ఉచిత విశ్రాంతి మందిరం కూడా అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. సింహగిరికి వెళ్లే దేవస్థానం బస్ కాంప్లెక్స్ భవనంలో కొంత భాగాన్ని 2003లో ఉచిత విశ్రాంతి మందిరంగా కేటాయించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. దాన్ని హాస్టల్ విద్యార్థులకు వంటశాలగా మార్చి, భక్తులకు కాకుండా చేశారు.

భక్తుల్ని కాదని.. బ్యాంకులకు అప్పగించి..


ఆంధ్రాబ్యాంకు, స్టేట్‌బ్యాంకు శాఖలకు కేటాయించిన యాత్రా నివాస్ భవనం

కొండదిగువ భక్తులకు ఉచిత సత్రాలకు కేటాయించిన శాశ్వత భవనాలను నిర్వీర్యం చేశారు. వాటిల్లో యాత్రా నివాస్ ఒకటి. 1996లో కొండ దిగువ గురువారం సంత ప్రాంగణంలో దీన్ని నిర్మించారు. పేద, మధ్యతరగతి భక్తులు ఈ భవనంలోనే ఉచితంగా బస చేసేవారు. ఈ భవనం నిర్వహణ సరిగా లేక, శిథిలావస్థకు చేరిందని చెప్పి, భక్తులను అనుమతించలేదు. అడవివరం బీఆర్టీఎస్ రోడ్డు విస్తరణలో తొలగించిన ఆంధ్రాబ్యాంకు భవనానికి ప్రత్యామ్నాయంగా పదేళ్ల క్రితం యాత్రా నివాస్‌లోని సగ భాగాన్నిచ్చారు. రూ.5 లక్షలు వెచ్చించి దేవస్థానమే మరమ్మతులు చేపట్టింది. మిగిలిన భాగాన్ని ఎస్‌బీఐకి అప్పగించింది. భక్తులకు ఉపయోగపడని భవనం బ్యాంకులకు ఎలా ఉపయోగపడిందో.. అధికారులకే తెలియాలి.

లాకర్ సదుపాయం కల్పించాలి



శ్రీదేవి కాంప్లెక్స్‌లో లాకర్ సదుపాయం ఏర్పాటు చేయాలి. లాకర్ లేకపోవడంతో వెంట తెచ్చుకున్న సామాన్యలకు భద్రత లేకుండా పోతోంది. లాకర్లు ఉంటే సామాన్లు అందులో ఉంచి, స్వామివారి దర్శనానికి సింహగిరికి ధైర్యంగా వెళ్లొచ్చు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గణేష్, యాత్రికుడు

శాశ్వత భవనం నిర్మించాలి



కొండ దిగువ ఉచిత సత్రం సమాచారాన్ని సూచిస్తూ బోర్డులు ఏర్పాటు చేయాలి. తద్వారా భక్తులకు ఎటు వెళ్లాలో స్పష్టంగా తెలుస్తుంది. కనీస సౌకర్యాలు ఉచిత సత్రంలో కల్పించాలి. తాత్కాలిక భవనాలు కాకుండా, భక్తుల ఉచిత విశ్రాంతికి శాశ్వత భవనాలను నిర్మించాలి.

– సాహు, యాత్రికుడు

క్లుప్తంగా

ఘనంగా గణపతి ఆలయం ప్రారంభోత్సవం


పూజలందుకున్న గణపతి, సాయిబాబా, ఆంజనేయస్వామి విగ్రహాలు

పెందుర్తి: పినగాడి కూడలి వద్ద **నూతనంగా** నిర్మించిన గణపతి, సాయిబాబా, **ఆంజనేయ** స్వామి ఆలయాన్ని ఆదివారం **శాస్త్రోక్తంగా** ప్రారంభించారు. విగ్రహాలకు చక్రస్నానం చేయించి, వేదమంత్రోచ్చరణ నడుమ ప్రతిష్టాపన చేశారు. అనంతరం విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం జరిపిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, నాయకులు, గణ సాయి ఆంజనేయ ఆటో స్టాండ్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆదిత్యునికి అభిషేకాలు


పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాతనగర్లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామి వారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి పాదాల ప్రతిష్ట


సత్తెమ్మతల్లి పాదాలను ప్రతిష్టలో అర్చకులు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మతల్లి పాదాల ప్రతిష్ట శ్రీనివాసనగర్ సమీపంలోని అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాదాలతో భారీ ఊరేగింపు జరిపారు. అనంతరం అర్చకుడు రాళ్లపల్లి కృష్ణకార్తీక్ ప్రతిష్ట పూజలు చేశారు. భక్తులు అమ్మవారి పాదాలకు పసుపు కుంకుమలు సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు పి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు గంట్ల కనకరాజు, సంయుక్త కార్యదర్శి బలిరెడ్డి శ్రీనివాసరావు, ఎస్ఎస్ఆర్ కల్యాణమండపం అధినేత బి.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. గోపాలపట్నం నుంచి సింహాచలం ప్రయాణించేవారు, భక్తులు ఆలయంలోకి వెళ్లలేని పరిస్థితుల్లో సమీపంలోనే ఉండే అమ్మవారి పాదాలు దర్శించుకునేలా ప్రతిష్ట చేసినట్లు గంట్ల శ్రీనుబాబు తెలిపారు.

పెదబాబు కుటుంబాన్ని పరామర్శించిన గండి


పెదబాబు కుటుంబంతో గండి రవికుమార్

పరవాడ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, లంకెలపాలెం మాజీ సర్పంచ్ యలమర్తి వెంకట నరసింహం(పెదబాబు) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నరసింహం కుటుంబాన్ని పెందుర్తి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆదివారం పరామర్శించారు. వై.వి. నరసింహంతో తనకున్న జ్ఞాపకాలను కుటుంబ సభ్యులతో గుర్తు చేసుకున్నారు. పెదబాబు మృతి పార్టీకి తీరని లోటన్నారు. లంకెలపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు సుందరపు అప్పారావు, గంజి సురేష్, కాత లోకేశ్వరరావు, ఐడి బాబు, అమృతపురం సర్పంచ్ సింగంపల్లి రామారావు, సిరపరపు వాసు, కరక రాము, పలువురు నాయకులు పెదబాబు కుటుంబానికి పరామర్శించారు.

బుదిరెడ్ల రామకృష్ణకు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బుదిరెడ్ల రామకృష్ణ ప్రమాదవశాత్తూ గాయపడ్డారు. దీంతో ఇంటికే పరిమితమైన ఆయన్ని పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ ఆదివారం రాత్రి పరామర్శించి, ఆరోగ్యంపై ఆరా తీశారు. గాయంతో బాధపడుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దొడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, మాజీ సర్పంచ్ దనిమిరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయుకులు యడ్ల నాయుడు, సబ్బవరపు నాగభూషణం, తుంపాల శివ, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జ్యోతిష్య శాస్త్రంపై మెగా సదస్సు


బాదంపూడి శివప్రసాద్‌శర్మకు అర్చక రత్న అవార్డు అందిస్తున్న జ్యోతిష్య పండితులు

సింహాచలం: 98వ వార్డు పరిధి బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ కల్యాణమండపంలో జ్యోతిష్య శాస్త్రంపై మెగా సదస్సు ఆదివారం నిర్వహించారు. ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రై.లి. వ్యవస్థాపకుడు సి.నరసింహ స్వామి ఆధ్వర్యంలో జరిగిన మెగా ఆస్ట్రాలజీ సెమినార్‌లో పలువురు జ్యోతిష్యశాస్త్ర ప్రావీణ్యులు పాల్గొన్నారు. ప్రవీణ, శిరోమణి తదితర స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు, డాక్టరేట్లు అందించారు. ఆస్ట్రాలజీలో ఉన్న పలు పద్ధతులను వివరించారు. జ్యోతిష పండితులు పి.అరుణ్‌మహేష్, కె.కృష్ణమూర్తి, పి.సంపత్ కుమార్, ఎం.శేషారావు, ఎస్.వి.రామణారావు, ఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ జ్యోతిష్య పండితుడు బాదంపూడి శివప్రసాద్‌శర్మకు అర్చక రత్న అవార్డు అందించారు.

అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం

పెందుర్తి: పాఠశాల నుంచి ఇంటికి బయలుదేరి అదృశ్యమైన ఓ బాలుడి ఆచూకీని పెందుర్తి పోలీసులు 24 గంటల్లో కనుగొన్నారు. బాలుడ్ని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలివి.. సుజాతనగర్లో నివాసం ఉంటున్న బాలుడు(14) పాపయ్యరాజుపాలెంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం పాఠశాలకు వెళ్లి, మధ్యాహ్నం సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆదివారం ఉదయం పెందుర్తి సమీపంలో గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులను పిలిపించి ఆ బాలుడ్ని అప్పగించారు.

పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై దాడులు దారుణం

అప్పన్న తొలిపావంచా వద్ద వీహెచ్‌పీ నిరసన


నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ నాయకులు

సింహాచలం: పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని, లేదంటే దాడులకు పాల్పడుతున్నవారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విశాఖ మహానగర్ నాయకులు హెచ్చరించారు. ఆ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ సింహాచలంలోని కొండ దిగువ తొలిపావంచా వద్ద వీహెచ్‌పీ నాయకులు ఆదివారం నిరసన తెలిపారు. వీహెచ్‌పీ నాయకుడు పూడిపెద్ది శర్మ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డుపై కేంద్రప్రభుత్వం తీసుకున్న మార్పులతో వెస్ట్‌బెంగాల్‌లో ముస్లింలు హిందువులపై దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అసలు హిందువులంతా ఏకమై తిరగబడితే ముస్లింలు ఏమవుతారో ఆలోచించుకోవాలన్నారు. వెంటనే పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు భాస్కరబట్ల ప్రసాద్‌శర్మ, ఎం.సంతోష్, గల్లా జగన్నాథ్ పాల్గొన్నారు.

భానుడి భగభగలు.. నిర్మానుష్యంగా రోడ్లు


నిర్మానుష్యంగా మారిన పరవాడ-యలమంచిలి రహదారి

పరవాడ: పెరిగిన ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. భానుడి ప్రతాపంతో ఉదయం 10 గంటల తరువాత రోడ్ల మీదకు వచ్చేందుకు జనాలు వెనుకంజ వేస్తున్నారు. రెండు రోజులు నుంచి మండుతున్న ఎండలకు తోడు, తీవ్ర ఉక్కబోతతో అల్లాడుతున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచే వడగాల్పులు మొదలయ్యాయి. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే పరవాడ-యలమంచిలి రహదారి నిర్మానుష్యంగా మారింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ ప్రయాణాలను రద్దు చేసుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. మండుతున్న ఎండలతో పాటు విద్యుత్ సరఫరాలో తరచూ కోతలు విధిస్తుండడంతో ఫ్యానులు, ఏసీలు పనిచేయక గ్రామీణ ప్రజలు మరింతగా ఇబ్బంది పడుతున్నారు. వడగాల్పుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో పరవాడ, వాడచీపురుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఇప్పటి వరకు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లే ప్రజల ఆరోగ్యంపై ఆందోళన నెలకొంది.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సబ్బవరంలో స్థానిక ప్రజలకు, విద్యార్థులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అగ్నిమాపక పరికరాల ప్రదర్శన, పనిచేయు విధానంపై చివరి రోజు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తుల సమయంలో ఏపీ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ పాత్రను వివరించారు. అత్యవసర సేవల కొరకు 101 లేదా 08924248799 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజుతో పాటు లీడింగ్ ఫైర్‌మన్ కె.ఎల్లాజి, డీవోపీ ఎం.శ్యామ్ కుమార్, బి.ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంతి తగిలే అంబేడ్కర్ విగ్రహం కళ్లజోడు విరిగింది

- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ వెల్లడి


పెదగాడి సచివాలయం వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

పెందుర్తి: మండలంలోని పెదగాడి గ్రామ సచివాలయ ప్రాంగణంలో ఉన్న బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహంపై దుండగుల దాడి జరగలేదని సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని పిల్లలు క్రికెట్ ఆడుతుంటే బంతి తగలడంతో విగ్రహానికి ఉన్న కళ్లద్దాలు విరిగిపోయాయని ప్రాథమికంగా నిర్ధారించినట్లు వెల్లడించారు. గ్రామంలోని సచివాలయ ప్రాంగణంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహ ధ్వంసంపై వివాదం రేగిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన సీఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐ అసిరితాత పెదగాడిలోని ఘటనా స్థలాన్ని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. రెవెన్యూ అధికారుల సహకారంతో విగ్రహానికి మరమ్మతులు చేపట్టారు.

సర్పంచ్ సహకారంతో సీసీ కెమెరాలు

గ్రామంలో విగ్రహాలపై దాడులు, ఇతరత్రా వివాదాల నేపథ్యంలో సచివాలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సర్పంచ్ కేసుబోయిన లావణ్య భర్త కేసుబోయిన త్రినాథ్ ఆర్థిక సాయంతో ఆదివారం సాయంత్రం సీసీ కెమెరాలను అమర్చారు.

'అపూర్వ' కలయిక


పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక వేడుకగా జరిగింది. పాతికేళ్ల తమ స్నేహాన్ని తలచుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని, పాఠశాల నాటి జ్ఞాపకాలను, చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

ధ్యానంతో చదువులో రాణింపు


ధ్యానంలో పాల్గొన్న బాలలతో ధ్యాన గురువులు, నిర్వాహకులు

పెందుర్తి: మానవ జీవనంలో ధ్యానం ఓ భాగం కావాలని, నిరంతర ధ్యాన ప్రకియ వలన చదువులో రాణింపు ఉంటుందని పాపయ్యరాజుపాలెంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధులు అన్నారు. ఆదివారం ధ్యాన కేంద్రంలో యూత్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాకాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకుంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి మానసిక ఆరోగ్యానికి నిరంతర ధ్యాన ప్రక్రియ అవసరం అన్నారు. ధ్యానం మానసిక ఒత్తిడిని జయించేలా చేస్తుందన్నారు. మరికొద్ది రోజుల్లో సమ్మర్ క్యాంప్ ద్వారా పిల్లలకు ధ్యానం తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అధిక సంఖ్యలో పిల్లలు, ధ్యాన గురువులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1981-82 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో ఆదివారం సందడిగా జరిగింది. 1981–82 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు 43 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనం చేసుకుని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారి కుటుంబం, వృత్తి, ఉద్యోగ వివరాలను పంచుకున్నారు. దాదాపు ఆరు పదుల వయసులో ఉన్నా.. ఆట పాటలతో అలరించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు వీఎస్ఆర్ మూర్తి, ఎ.రామునాయుడు, డాక్టర్ కేవీ రమణ, ఎంవీఎస్ఎస్ శర్మ, డి.రామకృష్ణ, కనకరాజు, వైకే శ్రీనివాస్, దేవర చిన్నంనాయుడు, రమణి, సుజాత, కోమలి, రాజేశ్వరి, పద్మావతి, నాగభూషణం, విజయ, విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కేసుల నమోదు

పెందుర్తి: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానంతో పాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్న సమాచారంతో చినముషిడివాడ, పెందుర్తి ప్రాంతాల్లో సీఐ కె.వి.సతీష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం బహిరంగ మద్యపానంపై 12 కేసులు, ధూమపానంపై 15 కేసులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై రెండు కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు బహిరంగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

యథేచ్ఛగా పందులు.. ఇబ్బందుల్లో ప్రజలు


శారదానగర్‌లో ఇళ్ల మధ్య పందులు


చినముషిడివాడ ప్రాంతంలో


పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో..

నియోజకవర్గంలోని జీవీఎంసీ పరిధిలో పందుల హవా పెరిగిపోయింది. ఎక్కడికక్కడ పందులు విచ్చలవిడిగా తిరుగాడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనావాసాల్లో తిరుగుతున్న పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారుల కోరుతున్నారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, కృష్ణరాయపురం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వందలాది పందులు సంచరిస్తున్నాయి. జీవీఎంసీలో విలీనమైన ఆయా ప్రాంతాల్లో వాడుకనీరు పోయేందుకు సరైన అవుట్ లెట్ సదుపాయం లేదు. ఎక్కడికక్కడే మురుగు నిలిచిపోవడమే పందుల సంఖ్య పెరగడానికి కారణమవుతోంది. పెందుర్తి, చినముషిడివాడ ప్రాంతాల్లో పందుల పెంపకం కేంద్రాలు అధికంగా ఉన్నాయి. ఇవి కూడా పందుల సంచారానికి కారణం.

– పెందుర్తి